క్లుప్తంగా

సొసైటీ చైర్మన్‌లు వీరే..

అంబాజీపేట: మండలంలోని నాలుగు సొసైటీలకు సంబంధించి నూతన చైర్మన్‌లను నియమిస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు ఆయా సొసైటీల సీఈఓలు శుక్రవారం తెలిపారు. అంబాజీపేట సొసైటీ అధ్యక్షుడిగా దొమ్మేటి సత్యమోహన్, పుల్లేటికుర్రు సొసైటీ అధ్యక్షుడిగా నందుల ఆదినారాయణ, చిరతపూడి సొసైటీ అధ్యక్షుడిగా బొంతు శ్రీనివాస్, గంగలకుర్రు సొసైటీ అధ్యక్షుడిగా మట్టపర్తి చంద్రశేఖర్‌లను నియమిస్తూ అగ్రికల్చర్ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి ఉత్తర్వులు వెలవడ్డాయన్నారు. గంగలకుర్రు సొసైటీ వద్ద సర్పంచ్‌లు దొంగ నాగేశ్వరరావు, కాండ్రేగుల శ్రీనివాసరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, రాయుడు షణ్ముఖ్, విత్తనాల శేఖర్, మట్టపర్తి నాగరాజు తదితరులు చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. సత్యమోహన్‌ను, శ్రీనివాసరావును, నందుల ఆదినారాయణలను పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: మండలంలోని ఊబలంక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అదనంగా 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ వర్క్ జరుగుతుందని అందువల్ల శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఊబలంక గ్రామం, రావులపాలెంలోని అంకాలమ్మగుడి ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు రక్తదాన శిబిరం

అంబాజీపేట: డొక్కా సీతమ్మ స్ఫూర్తితో ప్రారంభించిన ఇరుసుమండకు చెందిన కోనసీమ ఆహారనిధి వలంటరీ ఫుడ్ క్యాంపు 3వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 16న రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆహార నిధి వ్యవస్థాపక అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ తెలిపారు. ఈ రక్తదాన శిబిరాన్ని అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల నందు చేపట్టామన్నారు. ఈ శిబిరంలో రక్తదానం చేసే యువకులు తరలివచ్చి ఆహార నిధిని ప్రోత్సహించాలని కోరారు. ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులకు యువత స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన ఆహారనిధి పథకం ఒక వరం లాంటిదన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



కిడ్నీ బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: మండలంలోని కొమరాజులంక గ్రామానికి చెందిన గుత్రాల సత్తిబాబు గత కొద్ది రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. పేదరికంతో వైద్యం చేయించుకోలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న రావులపాలెం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు అతడి వైద్య ఖర్చుల నిమిత్తం శుక్రవారం బాధితుడి ఇంటి వద్దకు వెళ్లి రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేసినట్టు సభ్యులు తెలిపారు.

ఉద్యోగుల ధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మామిడికుదురు: సీపీఎస్ ఉద్యోగుల ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా చైర్మన్ డి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జి.చిరంజీవి పిలుపునిచ్చారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద శుక్రవారం జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ వద్ద మంగళవారం సీపీఎస్ ఉద్యోగుల ధర్నా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ ఐ.కొండయ్య, డిప్యూటీ తహసీల్దార్ శరణ్య, ఆర్ఐ అలీ, ఆర్టీసీ నేతలు ఎస్ఎస్‌వీ గణేష్, మేడిది శ్రీను, ఆదినారాయణ, ప్రసాద్, నార్ని బాబి, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల పవిత్ర రంజాన్ ప్రార్థనల్లో భాగంగా మూడో శుక్రవారం మసీదుల్లో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు జరిగాయి. ఉదయం సహర్‌తో మొదలైన ఉపవాస దీక్షలు సాయంత్రం ఇఫ్తార్‌తో ముగిశాయి. దీనిలో భాగంగా స్థానిక షియా జామియా మసీదుతో పాటు సున్నీ జామియా మసీదుల్లో జరిగిన సామూహిక ప్రార్థనల్లో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. మత ప్రబోధకులు షబ్బర్ అలీజైదీ రంజాన్ ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముస్లింలు ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు. మసీదు కమిటీల అధ్యక్షులు సర్కిల్ ఫర్హత్ అలీబేగ్, మసూద్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- ఘనంగా అంబేడ్కర్ జయంతి
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్, దళిత నాయకులు



పి.గన్నవరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్యే చిట్టిబాబు, మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరిదేవి



కమ్మిరెడ్డిపాలెంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న రాష్ట్ర వైఎస్సార్ సీపీ నేత దేవిడ్‌రాజు



సఖినేటిపల్లి మూడుతూముల సెంటర్లో అంబేడ్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

పి.గన్నవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. స్థానిక మూడు రోడ్ల సెంటర్లో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కోట విజయ భాస్కర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి, నివాళులు అర్పించారు. రాష్ట్ర మాలల జేఏసీ కో కన్వీనర్ కోట రామ్మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ మేధావి అంబేడ్కర్ అని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నక్కా కృష్ణవేణి, మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర రావు, సర్పంచ్ బొండాడ నాగమణి, నాయకులు పాల్గొన్నారు.

మొండెపులంకలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మొండెపులంక శివారు మల్లాయిపాలెం అరుంధతీపేటలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహాన్ని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక నాయకుడు ఆరుమిల్లి లాల్ బహదూర్, జిల్లా ఎంఎస్‌పీ అధ్యక్షుడు యార్లగడ్డ సత్తిబాబులు ఆవిష్కరించారు. సర్పంచ్ గుడాల రామారావు, ఎంపీటీసీ ఉండ్రాజవరపు శాంతకుమారి, నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు ఆరాధ్యుడు: ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్ని వర్గాల వారికి ఆరాధ్యుడని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సఖినేటిపల్లి మూడు తూముల సెంటర్లోను, కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో ఆయన విగ్రహాలకు ఎమ్మెల్యే రాపాక పూలమాల వేసి నివాళులర్పించారు. సఖినేటిపల్లి సమతా కల్యాణ మండపం వద్ద ఆయన విగ్రహానికి ఎంపీపీ వీరా మల్లిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అంతర్వేది దేవస్థానంలో బుంగవారి పేటలో స్థానిక సమైక్య యూత్ ఆధ్వర్యాన అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. వెంట ఎంపీపీ వీరా మల్లిబాబు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, మండల కోఆప్షన్ మెంబర్ బళ్ళ నోబుల్ ప్రభాకర్, నాయకులు కేఎస్ఎన్ రాజు, కుసుమ చంద్రశేఖర్, వాడపల్లి రాజబాబు, కె.అశోక్, వై.నారాయణ స్వామి, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

విగ్రహ ఆవిష్కరణ

అంతర్వేదిపాలెం కొబ్బరితోట కాలువగట్టు ఏరియాలో 5వ వార్డులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు గురువారం రాత్రి జరిగింది. శుక్రవారం ఆయన జయంతిని దళిత నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ ఇటీవల ఏర్పాటు చేసిన డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం నెలకొల్పడం వివాదాస్పదమైన సంగతి పాఠకులకు విదితమే.



బొబ్బర్లంకలో బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న కప్పల శ్రీధర్

జీవన్ యూత్ ఆధ్వర్యాన బాలం గ్రూపు ఏర్పాటు చేసిన ఈ విగ్రహ ఆవిష్కరణపై అదే ప్రాంతంలోని కట్టావారి గ్రూపు అభ్యంతరం తెలిపింది. దీనిపై ఇరువర్గాలతో అధికారులు నిర్వహించిన సుదీర్ఘ చర్చలు అనంతరం గత రాత్రి వారి నుంచి అంబేడ్కర్ విగ్రహాన్ని జీవన్ యూత్ తీసుకుని యథాస్థానానికి సమీపంలో డాక్టర్ అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని నెలకొల్పారు. విగ్రహానికి దళిత నాయకులు, అంబేడ్కర్ వాదులు, బాలం గ్రూపు ప్రజలు క్షీరాభిషేకం చేశారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం డాక్టర్ అంబేడ్కర్ సందర్భంగా చింతలమోరిలోని బీచ్‌నగర్, మూలపోడు, పోడుతోట, మధ్యగ్రూపు, వడ్లపాలెంలోలో ఆయన విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే శంకరగుప్తం, అడవిపాలెం, కత్తిమండ, మలికిపురం ప్రాంతాల్లో కూడా డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేశారు. వెంట పలువురు దళిత సంఘాల నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నతుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శ్లాఘించారు. అంబేడ్కర్ జయంతిలో భాగంగా శుక్రవారం నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహంతో పాటు కేంద్ర మాజీ మంత్రి బీఎస్ మూర్తి, మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు విగ్రహాలను ఎమ్మెల్యే చిట్టిబాబు శుక్రవారం ఆవిష్కరించారు. అక్కడే నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ భవనాన్ని ప్రారంభించారు. మగటపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు ప్రారంభించారు. అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు పార్టీల నేతలు, మాల మహానాడు, ఎస్సీ ఉద్యోగ సంఘాల నేతలు స్థానిక బస్టాండ్ సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కె.వనజకుమారి, నీతిపూడి గణేష్‌బాబు, నగరం ఏఎంసీ చైర్మన్ నక్కా కృష్ణవేణి, వైస్ చైర్మన్ కొమ్ముల సత్యామణి, పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడిగా నిలిచారని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం రాజోలు బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ ఎస్సీ వెల్ఫేర్ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే రాపాక పూలమాల వేసి నివాళులర్పించారు. రాజోలులో బొడ్డపల్లి వారి గ్రూపు, సుందరమ్మ చెరువుగట్టు, కేవీ స్ట్రీట్, ఏనుగుపల్లివారి పేట ప్రాంతాల్లో అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. పొదలాడ, సోంపల్లి, బి.సావరం గ్రామాల్లోని ముఖ్యకూడళ్లలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు స్థానిక యువజన సంఘాలు నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. చింతలపల్లి కళింగుల సెంటర్‌లో జరిగిన వేడుకల్లో మాజీ డిప్యూటీ స్పీకర్ ఏపీ సూర్యనారాయణరాజు, సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు. అలాగే పలు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కొత్తపేట: ప్రపంచమంతా ముక్తకంఠంతో కీర్తిస్తున్న మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి అన్నారు. అంబేడ్కర్ జయంతిని శుక్రవారం కొత్తపేటతో పాటు మండలంలో దళిత సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాతబస్టాండ్ సెంటర్, కమ్మిరెడ్డిపాలెం, బండారుపేటతో సహా మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు రాష్ట్ర పార్టీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మార్గన గంగాధరరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అయినవిల్లి: అయినవిల్లి, ముక్తేశ్వరం తదితర గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలను గుర్తు చేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే ముక్తేశ్వరం సెంటర్‌లో ఎస్సీ వెల్ఫేర్, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని జరిపారు. అలాగే మండలంలోని చింతనలంక, వెలువలపల్లి, నేదునూరు, కొండుకుదురు తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని జరిపారు.

అంబాజీపేట: అంబాజీపేటలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని వైఎస్సార్ సీపీ నాయకులు, దళిత సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద, నాలుగు రోడ్ల సెంటర్‌లో అంబాజీపేట అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే చిట్టిబాబు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాలుగు రోడ్ల సెంటర్‌లో ఏర్పాటు చేసిన కేకును ఎమ్మెల్యే చిట్టిబాబు కట్‌చేసి అభిమానులకు పంచారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీ హైస్కూల్‌లో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, వైస్ ఎంపీపీ సూదాబత్తుల లక్ష్మీభార్గవి తదితరులు అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

ఆత్రేయపురం: అంబేడ్కర్ ఆలోచనలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బొబ్బర్లంకలో రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ ప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లడ్ డొనేషన్ క్యాంపును జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్ ప్రారంభించారు. అనంతరం జైభీమ్ యూత్‌ను ప్రోత్సహించేందుకు ఆయన కూడా రక్తదానం చేశారు. సుమారు 25 మంది యువకులు బ్లడ్ డొనేషన్ చేశారు.

బాబాసాహెబ్ అందరివాడు : ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



రావులపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తదితరులు

రావులపాలెం: భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డా.బీఆర్ అంబేడ్కర్ జయంతిని శుక్రవారం మండలంలోని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మండలంలోని ముమ్మిడివరప్పాడు, రావులపాలెం కోనసీమ ముఖద్వారం, వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జరిగిన వేడుకలలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి పార్టీ శ్రేణులు, అంబేడ్కర్ అభిమానులకు పంచి శుభాకాంక్షలు తెలియజేశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ అందరివాడనీ, కొందరికే పరిమితం చేసేలా ఎవరూ ఉండకూడదని అన్నారు. 75 సంవత్సరాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాదిగలకు సముచిత స్థానాన్ని కల్పిస్తూ బొమ్మి ఇజ్రాయిల్ని ఎమ్మెల్సీగా చేసిన ఘనత సీఎం జగన్‌కే చెందుతుందన్నారు. యువత పెడదోవ పట్టకుండా అంబేడ్కర్ చెప్పిన కళ్లు అంటే విజ్ఞానపు వాకిళ్లు, వాటిని బద్ధకంతో నిద్రకు అంకితం చేస్తే భవిష్యత్ తలుపులు తెరుచుకోక పోగా అంతా అంధకారమే మిగులుతుంది. అలా కాక సమయాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకుపోతే అంతులేని జ్ఞానం మన సొంతం అవుతుంది. ఆ జ్ఞానమే ఇంకా ఇంకా సాధించాలనే తపనలకు మూలం అవుతుందన్నారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు సాకా ప్రసన్నకుమార్, బొక్కా వెంకటలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచన విధానాలు దేశానికి ఆదర్శప్రాయమని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లో నూతనంగా నెలకొల్పిన అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించడంతో పాటు సందిపూడిలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తదితరులు, చెముడులంక, ఆలమూరు, జొన్నాడ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాసు, నేలపూడి లావణ్య, కట్టా శ్రీనివాసు పాటు ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు.

అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు

సచివాలయం, ఆరోగ్య, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిల్వలు



పంపిణీకి సిద్ధంగా ఉన్న ఓఆర్ఎస్ ప్యాకెట్లు

అంబాజీపేట: ఈ ఏడాది ప్రారంభ దశలోనే ఎండలు మండిపోతున్నాయి. ఏప్రిల్ నెలలోనే మే నెల తరహా ఎండలు మండుతున్నాయి. చేతిలో గొడుగు, నెత్తి మీద నీడ లేకుండా బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. గత వేసవి అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. ఇందుకు పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గంలోని 11 మండలాల్లో ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించింది. వారంతా స్వచ్ఛందంగా సేవలందిస్తున్నట్లు ఆయా మండలాల ప్రాథమిక వైద్యాధికారులు చెబుతున్నారు. 11 మండలాల్లో 711 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటితో పాటు సచివాలయంలోని ఏఎన్ఎంల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు అందుబాటులో ఉంచారు.

వెయ్యిమందికి ఓ కేంద్రం..

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు నిల్వ కేంద్రం ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. అక్కడి అంగన్‌వాడీ, పీహెచ్‌సీ, ఆరోగ్య ఉప కేంద్రాల్లో ప్రతిరోజు 20 నుంచి 50 ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతారన్నారు. ఆశ కార్యకర్తల వద్ద కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉపాధి హామీ పనుల వద్ద ప్రత్యేకంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌ల వద్ద ఉంచుతున్నారు. పని చేసే వేళల్లో వీటిని నీళ్లలో కలుపుకుని తాగేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎండ తీవ్రతకు నీరసంగా ఉన్న వారికి ఓఆర్ఎస్‌ను పట్టించడం వల్ల అధికశక్తి పొందుతారనే విషయాన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎవరికైనా వడదెబ్బ తగిలినట్టు గుర్తిస్తే అతడిని వెంటనే నీడకు చేర్చి చల్లని నీటిలో తడిపిన గుడ్డతో ఒళ్లంతా తుడిచి వేడిని తగ్గించాలి. ఎక్కువ నీరు, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి. పరిస్థితి బాగా విషమిస్తే సమీప ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.

ముందస్తు ఏర్పాట్లు



వడదెబ్బ నివారణపై అందరికీ అవగాహన కల్పిస్తున్నాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నాం. ప్రతి మనిషి తమ ఒంట్లో 6 నుంచి 8 లీటర్ల నీటిని తగ్గకుండా చూసుకోవాలి. చెమట రూపంలో నీరు బయటకు పోవడం వల్ల తొందరగా నీరసం వచ్చే అవకాశం ఉంది.

– వి.గౌతమి, వైద్యాధికారి, పీహెచ్‌సీ, అంబాజీపేట

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం కండి



ఫైర్ ఆఫీస్ వద్ద కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ మధుకర్, ఎస్ఎఫ్‌వో ప్రభాకరరావు, సిబ్బంది

కొత్తపేట: వేసవి ఉష్ణోగ్రతలు తీవ్ర రూపం దాలుస్తున్న పరిస్థితుల్లో ఏ విధమైన అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తం కావాలని వైద్య విధాన పరిషత్ స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి సి.మధుకర్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలు (ఈ నెల 14 నుంచి 20 వరకూ) పురస్కరించుకుని స్థానిక అగ్నిమాపక కార్యాలయం వద్ద స్థానిక ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి (ఎస్ఎఫ్ఓ) బి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అగ్నిమాపక శకటం వద్ద పరికరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని వారోత్సవాలను ప్రారంభించారు. దానిలో భాగంగా అగ్నిమాపక శాఖ ముద్రించిన »మీ సేవే మా కర్తవ్యం–మీ రక్షణే మా ధ్యేయం« అనే పేరుతో ముద్రించిన కరపత్రాలను మధుకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. వాటిని స్థానికులకు పంపిణీ చేశారు. జాతీయ అవస్థాపన (అగ్ని) భద్రత నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు బయలుదేరిన అగ్నిమాపక శకటాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

రాజోలు: అగ్నిమాపక వారోత్సవాలను శుక్రవారం రాజోలు ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి ప్రారంభించారు. స్థానిక అగ్నిమాపక కార్యాలయం వద్ద ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా స్పందించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 20వ తేదీ వరకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. సోషల్ వర్కర్ యాలంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఏరువాక సాగారో..



మాచవరంలో దుక్కు దున్నుతున్న రైతులు

అంబాజీపేట: ఏరువాక సాగారో రన్నో.. చిన్నన్న.. అనే పాట నానుడిని ప్రస్తుతం కోనసీమ కొబ్బరితోటల్లో గుర్తు చేస్తుంది. సంప్రదాయబద్ధంగా ఎడ్లు, నాగలి ఉపయోగించి తమ తమ కొబ్బరి, అరటి, కోకో, వరి చేలల్లో దుక్కు దున్నుతున్నారు. పూర్వం నుంచి రైతులు తమ కొబ్బరి తోటలను, వరిచేలను దున్నేందుకు ఎడ్లు, నాగలిని ప్రస్తుత కాలంలోనూ వాడుతున్నారు. పశు పోషణ కష్టం కావడం, నిర్వహణ వ్యయాలు ఎక్కువైనప్పటికీ ఏరువాక చేసిన సాగు ఎంతో లాభదాయకమని రైతులు చెబుతున్నారు. రోజుకు రూ.1000లు వంతు అద్దె ప్రాతిపదికన ఏరువాకను కొంత మంది రైతులు ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు.

ఇంటింటా ప్రజల స్వాగతం



జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని వివరిస్తున్న జెడ్పీటీసీ వరలక్ష్మి

అంబాజీపేట: వైఎస్సార్ సీపీకి ప్రజల్లో ఆదరణ ఉండటం వల్లే ప్రతి ఇంటా స్వాగతిస్తున్నారని, స్టిక్కర్లు అతికించేందుకు ముందుకు వస్తున్నారని జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. పసుపల్లిలో జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జెడ్పీటీసీ, జేసీఎస్ కన్వీనర్లు మాట్లాడుతూ పథకాలు పొందిన ప్రజలే కాకుండా అన్ని వర్గాల ప్రజల మద్దతు వైఎస్సార్ సీపీకి అధికంగా ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశంలో ఏ సీఎం అమలు చేయలేదన్నారు. పేదల బతుకుల్లో వెలుగులు నింపుతున్న జగనన్న పరిపాలన మరి కొన్నేళ్లు కొనసాగించేలా ప్రజలు మద్దతు లభిస్తుందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన పనులను, పథకాలను ప్రజలకు వివరించి వారి అనుమతితో స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టపర్తి నాగరాజు, గంటి శ్రీను, పిల్లి భాగ్యలక్ష్మి, మామిడిపల్లి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.